క్లుప్తంగా

ఏఎస్ఐగా పదోన్నతి


ఓబులేసు

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన ఓబులేసుకు రెండు రోజుల క్రితం ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. 1993లో కానిస్టేబుల్‌గా ఎంపికై ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 ఏళ్లు పనిచేశారు. 2013లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది కర్నూలు, కోడుమూరు, ఎస్సీ, ఎస్టీసెల్, డీసీఆర్‌బీ తదితర స్టేషన్‌ల్లో పనిచేసి ప్రస్తుతం కొత్తపల్లె పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా పోలీసు అధికారులు ఏఎస్ఐగా పదోన్నతి కల్పించి కోసిగి పీఎస్‌కు బదిలీ చేశారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన ఓబులేసును గ్రామస్తులు అభినందిస్తున్నారు.

పంట నమోదుతో అనేక ప్రయోజనాలు


ఆర్‌ఎస్ రంగాపురంలో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

బేతంచెర్ల: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పంట నమోదు వల్ల నష్ట పరిహారం, బీమా, సున్నా వడ్డీకి రుణాలు, మద్దతు ధర వంటి లాభాలు ఉంటాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏఈఓ మధు బెన్ని రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు యశోద, వైష్ణవి ఉన్నారు.

ఆ లేఔట్లకు అనుమతులు లేవు

- నగర పంచాయతీ కమిషనర్ రమేష్‌బాబు

బేతంచెర్ల: బేతంచెర్ల నగర పంచాయతీలోని పలు లేఔట్లకు అనుమతులు లేవని కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. పట్టణంలోని ధరణి టౌన్ షిప్ సమీపంలోని సర్వే నంబర్ 183, కందకం దగ్గర గల సర్వే నంబర్ 451, బలపాలపల్లె రోడ్డులోని సర్వే నంబర్లు 485, 486, అల్లా బకాష్ దర్గా వెనుక వైపు ఉన్న సర్వే నంబర్ 502, బలపాలపల్లె రోడ్డు చివర సర్వే నంబర్ 509, 507 లను బేతంచెర్ల నగర పంచాయతీ అనాధికార లేఔట్లుగా గుర్తించిందని పేర్కొన్నారు. ఈ సర్వే నంబర్లలో స్థలాల కొనుగోలు, నిర్మాణాలకు నగర పంచాయతీ అనుమతి ఇవ్వదని స్పష్టం చేశారు.

సారా విక్రేతల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపిస్తున్న సెబ్ సీఐ

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద 40 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు సెబ్ పోలీస్‌స్టేషన్ సీఐ జోగేంద్ర బుధవారం తెలిపారు. తెలుగుపేటకు చెందిన చిన్నమద్దిలేటి, చిన్న బూసిబాలపుల్లయ్య తమ ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరి వద్ద 20 లీటర్ల చొప్పున మొత్తం 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. తనిఖీల్లో డీటీఎఫ్ సీఐ విజయకుమార్, సెబ్ ఎస్ఐలు పాతులయ్య, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యుడు బిచ్చయ్య 463 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ వాటివి వినియోగించడం తగ్గించాలని, ఎక్కువగా ఆకు కూరలు, దానిమ్మ, బొప్పాయి, డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు. కంటి అద్దాలు అవసరం ఉన్న వారికి త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు.

విప్లవ వీరుడు.. రేనాటి సూర్యుడు

- తెల్లదొరల పాలిట సింహస్వప్నం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి
- తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడు
- నేడు స్వాతంత్య్ర దినోత్సవం


నరసింహారెడ్డి విగ్రహం

కోవెలకుంట్ల: మనదేశానికి స్వాతంత్య్రం సిద్ధింపచేసేందుకు బ్రిటీష్‌వారిపై తిరుగుబాటు బావుట ఎగుర వేసిన మొట్ట మొదటి విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. బ్రిటీష్‌వారి కబంధ హస్తల నుంచి మనదేశానికి విముక్తిని కల్పించేందుకు నరసింహారెడ్డి విప్లవ మార్గాన్ని ఎంచుకుని వారిపై తిరుగుబాటు చేశాడు. నరసింహారెడ్డి వీర మరణం పొంది 177 సంవత్సరాలు కావస్తున్నా తెల్లదొరలపై పోరాటం చేసేందుకు ఏర్పాటు చేసిన కోట గోడలు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. బ్రిటీష్‌వారిని గడగడ లాడించిన నరసింహారెడ్డి రేనాటి సూర్యుడిగా, దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి రేనాటి చంద్రుడిగా 2002వ సంవత్సరం తంగిరాల సుబ్బారావు రేనాటి సూర్యచంద్రుల గ్రంథాన్ని ఆవిష్కరించారు. నేడు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బ్రిటీష్ పాలనపై ఆయన పోరాటాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

సైరా నరసింహారెడ్డి

కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సీతమ్మ, పెద్దమల్లారెడ్డి దంపతుల కుమారుడు నరసింహారెడ్డి. హైదరాబాద్ నవాబులు రాయలసీమ జిల్లాలైనా కర్నూలు, కడప, అనంతపురం, బళ్లారిని దత్తత మండలాలుగా ప్రకటించి బ్రిటీష్‌వారికి దారాదత్తం చేశారు. పాలనలో నొస్సం ప్రధాన కేంద్రంగా బ్రిటీష్ పాలన కొనసాగేది. నరసింహారెడ్డి తాత జయరామిరెడ్డికి పన్నులు, భూమిశిస్తు వసూలు చేసే అధికారం అప్పగించారు. ఆయన మరణానంతరం వారసత్వంగా ఈ బాధ్యత నరసింహారెడ్డికి వచ్చింది.

నరసింహారెడ్డి విగ్రహం:

బ్రిటీష్ నిరంకుశత్వ పాలనకు ప్రతిఘటించి మొదటిసారిగా 1842లోనే వారిపై తిరుగుబాటు బావుట ఎగురవేశాడు. ఆయన తిరుగుబాటుకు బ్రిటీష్ సామ్రాజ్యం గజగజ వణికిపోయింది. తన పోరాటంలో కోవెలకుంట్ల తహసీల్దార్‌ను నరికి చంపడమే కాక బ్రిటీష్‌వారి ఖజానాను కొల్లగొట్టారు. ఆయన్ను పట్టించిన వారికి 10వేల దినారాలు బహుమతి అందజేస్తామని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది. ఎట్టకేలకు 1847లో సంజామల మండలం జగన్నాథగుట్టపై నరసింహారెడ్డిని ప్రాణాలతో పట్టుకుని బంధిపోటు దొంగగా ముద్రవేసి 1847 ఫిబ్రవరి 22వ తేదీ కోవెలకుంట్ల పట్టణ సమీపంలోని జుర్రేరు ఒడ్డున ఉరిశిక్ష అమలుపరిచారు. అయితే నరసింహారెడ్డి మరణించిన వందేళ్లకు స్వాతంత్య్రం సిద్ధించింది. నాటి నుంచి భారతీయులు ఆయనను రేనాటి సూర్యుడిగా పిలుచుకుంటుంటారు. ఇప్పటికీ రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లలో నరసింహారెడ్డి పేరుపై సైరా నరసింహారెడ్డి.. నీపేరే బంగారు కడ్డీ అన్న జానపద గేయాలు వినిపిస్తుండడం అలనాటి వీరత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.



కోవెలకుంట్లలో నరసింహారెడ్డి కొల్లగొట్టిన అప్పటి ట్రెజరీ ఉన్న ప్రదేశం, నరసింహారెడ్డి వినియోగించిన ఫిరంగి

కోవెలకుంట్లలో నరసింహారెడ్డి విగ్రహం:

బ్రిటీష్ పాలనలో కోవెలకుంట్ల పట్టణంలోని ప్రస్తుత గాంధీసెంటర్ సమీపంలో ట్రెజరీ ఏర్పాటు చేసుకున్నారు. 1846లో నరసింహారెడ్డి ఈ ట్రెజరీపై దాడి చేసి 805 రూపాయల 10 అణాల నాలుగుపైసలను కొల్లగొట్టారు. ట్రెజరీపై దాడికి గుర్తుగా ఆ ప్రాంతంలో 2012 ఏడాదిలో పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది చిన్న ఎల్లారెడ్డి ఆర్థిక సహకారంతో నరసింహారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి అప్పటి నుంచి ఏటా వర్ధంతిని నిర్వహిస్తున్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రను వెండితెరపైకి ఎక్కించారు. చిరంజీవి కథానాయకుడిగా నాలుగేళ్ల క్రితం సైరా నరసింహారెడ్డి పేరుతో చలన చిత్రం విడుదలైంది.

ఊరూర.. జెండా పండుగ:

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్లు కావస్తుండడంతో ఊరూర జెండా పండుగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పంద్రాగస్టు సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రైవేట్ రంగ కార్యాలయాలపై మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది. ప్రతి ఇంటిపై జెండా ఎగరాలని కేంద్రప్రభుత్వం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆయా కార్యాలయాలపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయడంతోపాటు వివిధ పాఠశాలల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసులు

డోన్ టౌన్: డోన్ డీఎస్పీగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసరెడ్డిని విజయవాడ వీఆర్‌లోకి పంపించారు. కర్నూలు సీఐడీ విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసులును డోన్ డీఎస్పీగా బదిలీ చేశారు. శ్రీనివాసులును పలువురు సీఐలతో పాటు ఎస్ఐలు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డిని డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు.

సారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలో సారా విక్రయిస్తున్న రామకృష్ణ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సజ్జద్ అలీ తెలిపారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకునేందుకు ఉద్యమిస్తాం

కోవెలకుంట్ల: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు ఇటీవల సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటే అడ్డుకుంటామని అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ జరిగితే మాలలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకబడిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను అడ్డుకునేందుకు చేపట్టే ఆందోళనల్లో భాగంగా ఆగస్టు 15ను బ్లాక్‌డేగా పరిగణించి నిరసన వ్యక్తం చేయనున్నట్లు వెల్లడించారు.

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణా తరగతులు



శిక్షణా తరగతులకు హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, శిక్షణ ఇస్తున్న ఆర్పీలు

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు ఈఓఆర్డీ శ్రీహరి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆదాయ మార్గాలు ఎంచుకుని పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలని చెప్పారు. నిధులు, ఖర్చులపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, పారిశుద్ధ్యం, ఘన, ద్రవ పదార్థాల సేకరణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. ఈఓపీఆర్డీ రాధిక పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై శిక్షణ

బేతంచెర్ల: ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ వెంగన్న, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి జరిగిన సర్పంచ్‌ల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు గ్రామాల అభివృద్ధి, క్లీన్ అండ్ గ్రీన్ గ్రామాలు, తాగునీరు, మహిళా సాధికారత, సుపరిపాలన తదితర అంశాలపై ఆర్పీలు కృష్ణమూర్తి, శివ నాగయ్య, నాగశేఖర్ అవగాహన కల్పించారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

బనగానపల్లె రూరల్: సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు అన్నారు. స్థానిక పొదుపు భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. నాగరాజు మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకంగా ఉంటుందని తెలిపారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి


ఏకలవ్యుడి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డోన్ రూరల్: పట్టణంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మేడసారి గోపాల్, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటారాముడు, సెక్రెటరీ చౌటా రామయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అధికారంలోకి వస్తే ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని టీడీపీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. నాయకులు సాలన్న, ప్రతాప్, శ్రీనివాసులు, మధు తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగకు ముస్తాబు


ఉన్నత పాఠశాలలో జెండా స్థూపానికి రంగుల కాగితాలు అంటిస్తున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: జెండా పండుగకు ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు ముస్తాబయ్యాయి. గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆయా పాఠశాలలు, కార్యాలయాలను త్రివర్ణ రంగుల కాగితాలతో అలంకరించారు. రంగవల్లులు వేశారు. కాగా స్వాతంత్య్ర వేడుకలకు ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సొంత నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో మొత్తం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు 78 ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. వివరాలు.. కోర్నపల్లెకు చెందిన ప్రదీప్‌రెడ్డి పని నిమిత్తం బైక్‌పై తిమ్మనాయినపేటకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో చింతలాయిపల్లె సమీపంలోకి రాగానే తాడిపత్రి నుంచి కోవెలకుంట్లకు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. కాలికి తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రక్తదానం ద్వారా ప్రాణదాతలు


రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హరికిషన్

డోన్ టౌన్: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలుగా మారుతారని డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్కేపీ హైస్కూల్‌లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. యువతీ యువకులు సమాజంపై బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. పట్టణానికి చెందిన చరణ్ తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 55 మందితో రక్తదానం చేయించడం అభినందించదగ్గ విషయం అన్నారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, పట్టణ ప్రముఖులు జయశీల గుప్త, నాగరాజు, రామకృష్ణ, శంకర్ గౌడ్, గోవిందరెడ్డి, సుబ్బుయాదవ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు


ముద్దవరం జెడ్పీ హైస్కూల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

బేతంచెర్ల: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముద్దవరం జెడ్పీ హైస్కూల్, బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో బుధవారం క్రీడా పోటీలను నిర్వహించారు. విద్యార్థులు కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు మాట్లాడుతూ.. స్వాతంత్య్రం కోసం పోరాడిన దేశ నాయకులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని తెలిపారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం


బాత్‌రూంలను పగులగొడుతున్న టీడీపీ నాయకులు


ధ్వంసం చేసిన బాత్‌రూంలు

కొలిమిగుండ్ల: అధికారాన్ని అడ్డుపెట్టుకుని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నారు. బుధవారం అబ్దులాపురంలో రైతు బయ్యపురెడ్డి ఇంటి బాత్‌రూం, గేటును టీడీపీ నాయకులు నాగరాజు, పాలయ్యతో పాటు పదిహేను మంది దాకా వచ్చి పగులగొట్టారు. రైతు బయ్యపురెడ్డి సుమారు 20 ఏళ్ల క్రితమే ఇంటి ఆవరణలో బాత్‌రూంలు నిర్మించుకున్నాడు. ఐదారేళ్ల క్రితం ఇద్దరు టీడీపీ నాయకులు భూమి కొనుగోలు చేశారు. పొలానికి వెళ్లేందుకు కాలిబాట ఉందని, రెండు అడుగుల స్థలం దారికి ఉందని కొద్ది రోజుల నుంచి రైతుతో వాగ్వాదానికి దిగుతూ వచ్చారు. దీంతో సమస్యను లాయర్ దృష్టికి తీసుకెళ్లి ఇద్దరికీ నోటీసులు ఇప్పించాడు. ఆగ్రహించిన టీడీపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు సైతం వారికే వత్తాసు పలికి బాత్‌రూంలు తొలగించాలని హుకుం జారీ చేశారు. పోలీసుల అండతో టీడీపీ నాయకులు మనుషులను వెంటపెట్టుకుని వచ్చి గడ్డపారలతో బాత్‌రూంలు, గేటును ధ్వంసం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి నిర్మాణం చేసుకొని ఇక్కడే నివాసం ఉంటున్నామని బాధితుడు వాపోయాడు. తమపై కక్ష గట్టి నిర్మాణాలు కూలదోశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంగ్లం.. ఆయోమయం

ప్యాపిలి: స్థానిక కేజీబీవీలో రెండు నెలలుగా ఇంగ్లిష్ లెక్చరర్ లేక ఇంటర్ విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లలు ఇంగ్లిష్‌లో వెనకపడుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా లెక్చరర్ లేకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై కేజీబీవీ ప్రత్యేక అధికారిణి ప్రియాంకను వివరణ కోరగా ఇంగ్లిష్ అధ్యాపకురాలు మెటర్నటీ సెలవులో ఉన్నట్లు తెలిపారు. తాత్కాలికంగా మరొకరిని నియమించుకోవాల్సిందిగా అధికారులు ఆదేశించినట్లు తెలిపారు. అయితే టెట్, డీఎస్సీ ఉన్న కారణంగా ఎవరూ ఆసక్తి చూపడం లేదన్నారు.

12 లీటర్ల సారా స్వాధీనం

ప్యాపిలి: స్థానిక టమాట మార్కెట్ వద్ద నాటుసారా తరలిస్తున్న అశోక్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ మురళీకృష్ణ తెలిపారు. తుగ్గలి మండలం రోళ్లపాడు తండా నుంచి నిందితుడు సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


సీతారామచంద్ర స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: మండల పరిధిలోని లింగంబోడు గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆలయ పూజారులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. గతంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ సహకారంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆలయాలు నిర్మించినట్లు తెలిపారు. హిందూ సనాతన ధర్మానికి పెద్దపీట వేసినట్లు చెప్పారు. అవుకు మండలంలోనే గుండ్లశింగవరం, అవుకు, ఇస్రానాయక్‌తాండా, గడ్డమేకుల పల్లె, లింగంబోడులో గత ప్రభుత్వ సహకారంతో ఆలయాలు నిర్మించామని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.